ప్రజాశక్తి
సోమవారం 25 నవంబర్ 2024
5
శ్రీ సత్యసాయి

ముగిసిన సత్యసాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

సత్యసాయి జయంతి వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 18 న వేణు గోపాలస్వామి రథోత్సవంతో జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. 23 సత్య సాయి యూనివర్సిటీ స్నాతకోత్సవం, 23 న సత్యసాయి జయంతి వేడుకలు ప్రశాంతి నిలయంలో వైభవంగా నిర్వహించారు. శనివారం జరిగిన వేడుకలకు గవర్నరు అబ్దుల్ నజీర్ ,రాష్ట్ర మంత్రులు సవితమ్మ, సత్య కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పల్లె సిందూరరెడ్డి, ఎంఎస్. రాజు హాజరయ్యారు. జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రశాంతినిలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్పీ రత్న ఆధ్వర్యంలో పగడ్బందీగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సత్య సాయి వేడుకలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, నాయకులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

శోకసంద్రంలో ఎల్లుట్ల

మృతుల కుటుంబాలను పరామర్శించిన నాయకులు, అధికారులు

బాధితులకు పరిహారం చెక్కులు అందజేసిన మంత్రి పయ్యావుల

అంత్యక్రియల్లో పాల్గొన్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

ప్రజాశక్తి - పుట్లూరు

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండల పరిధిలోని ఎన్‌హెచ్–44 రహదారిపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు 8 మంది మృతిచెందారు. వీరి మృతదేహాలను ఆదివారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఈనేపథ్యంలో ఎల్లుట్ల గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాలపెద్దయ్య(50), డి.నాగమ్మ(45), బి.నాగమ్మ(50), డి.రామాంజినమ్మ(42), చిన్న నాగన్న(52), కొండమ్మ(48), జయరాముడు(40), ఈశ్వరయ్య(55) మృతదేహాలను ఆదివారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో పలువురు టిడిపి, వైసిపి, ఇతర పార్టీల నాయకులు మృతదేహానికి నివాళులు అర్పించారు. మృతుల కుటుంసభ్యులను పరామర్శించారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మృతదేహాలకు నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను, పోలీసులను కోరారు. వీరితో పాటు శింగనమల నియోజకవర్గ టిడిపి ద్విసభ్య కమిటీ సభ్యులు నరస నాయుడు, కేశవరెడ్డితో పాటు నాయకులు కోమటికుంట కులశేఖర్ రెడ్డి ఎల్కే చెన్నారెడ్డి, గోవర్ధనరాజు , సుదర్శన్ నాయుడు, బ్రహ్మయ్య , రవి, విజయ్, ప్రసాద్ తదితరులు మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. వైసిపి నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంపీపీ రాఘవరెడ్డి, మరుగుపల్లి నాగేశ్వర్ రెడ్డి తదితరులు మృతదేహాలకు నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందజేశారు. మాజీ ఎమ్మెల్యే యామినీబాల తదితరులు గ్రామానికి సందర్శించి మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు.

బాధితులకు న్యాయం చేయకపోతే కలెక్టరేట్ ముట్టడి : జేసీ

గార్లదిన్నె మండలం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబసభ్యులకు, క్షతగాత్రులకు న్యాయం చేయకపోతే గ్రామస్తులతో కలసి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి మృతదేహాలను నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఇవ్వకపోతే గ్రామస్తుల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు రవీంద్రారెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, హరినాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు. గార్లదిన్నె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం దిగ్భ్రాంతికరమని టిడిపి నాయకులు దండు శ్రీనివాసులు,ఆకుల బాబు అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి మృతదేహాలకు శనివారం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్న వారు మృతుల కుటుంబాలకు రూ. 80వేల ఆర్థికసాయం అందజేశారు.

క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్, మంత్రి

గార్లదిన్నె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం నగరంలోని కిమ్స్ సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం ఉదయం పరామర్శించారు. ప్రమాదఘటనను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ధైర్యం చెప్పారు. అదే విధంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, శింగనమల టూ మెన్ కమిటీ సభ్యులు నరసానాయుడు, కేశవరెడ్డిలతో కలిసి బాధితులను పరామర్శించారు. అధైర్య పడవద్దని ప్రభుత్వ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

బాధితులకు అండగా ఉంటాం : ఇన్‌ఛార్జి మంత్రి

గార్లదిన్నె మండలం తలగాసిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై బస్సు – ఆటో ఢీకొన్న ప్రమాద ఘటనలో మృతిచెందిన వారి కుటుంబసభ్యులకు, చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ.భరత్ భరోసా ఇచ్చారు. అనంతపురం నగరంలోని కిమ్స్ సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. గాయపడిన వారి చికిత్స ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాద వివరాలను, అనంతరం చికిత్సకి సంబంధించిన వివరాలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, జిల్లా ఎస్పీ పి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం :మంత్రి పయ్యావుల

రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం నుంచి సాధ్యమైనంత వరకు సహకారం అందిస్తామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం గార్లదిన్నె మండలం తలగాసిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై బస్సు – ఆటో ఢీకొన్న ప్రమాద ఘటనలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామంలో ఆదివారం రాత్రి పరామర్శించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, జిల్లా ఎస్పీ పి.జగదీష్, తదితరులతో కలిసి మృతుల కుటుంసభ్యలను పరామర్శించారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల చొప్పున మంజూరైన పరిహారానికి సంబంధించిన చెక్కులను మంత్రి అందజేశారు. ప్రభుత్వం నుంచి అవుట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ సత్య బాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తహశీల్దార్ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

రోడ్డు ప్రమాదాలకు కారణాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వరుస రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న కారణాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గార్లదిన్నె మండలం లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది కూలీలు మరణిస్తే కేవలం ఐదు లక్షల రూపాయల చొప్పున పరిహారం ఇవ్వడం సరికాదన్నారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ డిమాండ్ చేసినట్లు మృతుల కుటుంబాలకు శాశ్వత ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈ సంవత్సరంలో జిల్లాలో 27 మంది వ్యవసాయ కూలీలు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందారన్నారు. సంఘటన జరిగినప్పుడు హడావుడి చేయడం ఆ తర్వాత వదిలివేడయం అలవాటుగా మారిందని విమర్శించారు. రోడ్డు ప్రమాదాలకు ఆటో డ్రైవర్లే కారణమని వారిని వేధిస్తున్నారన్నారు. ప్రధానంగా వ్యవసాయ పనుల కోసం కూలీలు 50 నుండి 70 కిలోమీటర్లు ఎందుకు వెళ్ళాల్సి వస్తుందో అధికారులు, పాలకులు గుర్తించాలన్నారు. దీనికి పరిష్కారం ఏమిటని గుర్తించడానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడం అవసరమని అన్నారు. కూలీలకు స్వంత గ్రామాల్లో పనులు లేకపోవడం, ఉపాధి హామీ నిధులు వేల కోట్ల రూపాయలు అక్రమార్కులు కాజేయడమనే ప్రధాన కారణాలని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రమాదాల్లో మృతిచెందుతున్న వారు సొంత భూమి లేనివారు, దళితులు, వెనుకబడిన తరగతుల్లోని వృత్తి దారుల కుటుంబాలకు చెందిన వారే ఉన్నారన్నారు. మృతుల కుటుంబాలకు ప్రకటించిన హామీలు అమలు కావడంలేదు. గతంలో గుంతకల్లు మండలం వై.టి. చెరువు, గార్లదిన్నె మండలం కొప్పలకొండ రోడ్డు ప్రమాదాల మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రకటించిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని అన్నారు. ప్రమాదాలు నివారించడానికి శాశ్వతంగా తీసుకోవాల్సిన చర్యలపై అఖిలపక్షం వేసి నిర్ణయించాలని వి. రాంభూపాల్ కోరారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

రేపు కలెక్టరేట్ ముట్టడి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నె 26వ తేదీ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణం లోని సిఐటియు కార్యాలయంలో కలెక్టరేట్ ముట్టడి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ కార్మిక లోకం దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక కార్పొరేట్లకు అనుకూలంగా తెచ్చిన 4 లేబర్ కోర్టుల రద్దు, కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ, కాంటీన్ నెట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, 200 ఉపాధి హామీ పని దినాలు, రైతులకు 2013 భూసేకరణ చట్టం అమలుతో పాటు నిర్బంధ భూసేకరణ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా ప్రాథమిక హక్కులు, పౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ఫెడరల్ స్ఫూర్తి, లౌకికతత్వానికి హాని కలిగించడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో 'నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం' సందర్భంగా దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ, పట్టణ పేదలు, కార్మికులు, మహిళలు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున సమీకృతమై ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్. నరసింహులు, ప్రాంతీయ నాయకులు బ్యాళ్ల అంజి, ముత్యాలు, శ్రావణి, నాగమణి, పవన్, కప్పల బండ రమేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 26వ తేదీ కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, ఎస్‌హెచ్.బాషా, నాయకులు కదిరప్ప, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి, మండల కో

ఫీజు రీయింబర్స్‌మెంట్ కారణంతో హాల్ టిక్కెట్లు ఆపొద్దు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య కారణంగా ఏ విద్యార్థికి హాల్ టిక్కెట్లు ఇవ్వటాన్ని నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధించడం చేయరాదని జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఏ డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలలో అయినా విద్యార్థులకు హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధిస్తే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కళాశాల ఫీజు చెల్లించకపోవడం వల్ల కొంతమంది డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వకపోవడం, వారిని పరీక్షలను రాయనీకపోవడం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లను ఎలాంటి హోల్డ్ చేయకూడదని ప్రభుత్వం గైడ్‌లైన్స్ ఇచ్చిందని చెప్పారు. విద్యార్థుల సర్టిఫికెట్లను హోల్డ్ చేస్తే సంబంధిత కళాశాలను బ్లాక్ లిస్టులో ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ శిక్షణ తప్పనిసరి చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి విద్యార్థికి ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ శిక్షణలు తప్పనిసరి చేయాలని ఎస్‌డిజిఎస్ కళాశాల జాయింట్ సెక్రటరీ దాస గంగాధర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ డి జిఎస్ కళాశాలలో 76వ ఎన్ సి సి డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దాస గంగాధర్ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జె ఎస్ వి ఎస్ ప్రసాద్, ఎం బి ఏ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ నాగేంద్ర కుమార్ తో కలిసి సెక్రటరీ సెరిమోనియల్ సెల్యూట్, మార్చ్ ఫాస్ట్, యన్ సి సి సాంగ్, జాతీయ గీతం ఆలపించారు. అనంతరం ఎన్ సిసి కాడేట్స్ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భద్రతకు సంబంధించి భవిష్యత్ కాలం అవసరాలను అనుసరించి విద్యార్థి దశలో ప్రతి విద్యార్థికి యన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ లాంటి శిక్షణలు అవసరమన్నారు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతి స్కూలు, కళాశాలలో ఎన్‌సిసిని తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు ఇస్తున్న మాదిరిగానే ప్రైవేటు సంస్థలలో ఉన్న విద్యార్థులకు కూడా అవసరమైన నిధులు మంజురు చేసి ప్రోత్సాహాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరారుఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ ఫణింద్ర, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రాజన్న, పీడీ హేమంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే సిఐటియు లక్ష్యం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

కార్మికుల సంక్షేమమే సిఐటియు లక్ష్యమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న నూతన సత్యసాయి వాటర్ పంప్ వద్ద ఆదివారం జి.ఓబులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి తాగునీటి సరఫరా వైఎస్ఆర్‌టియుసి యూనియన్‌కు చెందిన టి.రాజారెడ్డి, సి.నరేష్‌తో పాటు 28 మంది కార్మికులు సత్యసాయి వాటర్ సప్లై మధు, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో సిపిఎం అనుబంధ సంస్థ సిఐటియులో చేరారు. వారిని జి.ఓబులు సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సిఐటియు కార్మికుల పక్షాన ఎన్నో పోరాటాలు చేసిందని, తమ డిమాండ్ల సాధన సిఐటియుతోనే సాధ్యమని తెలిపారు. భవిష్యత్తులో జరగబోయే కార్యక్రమాల్లో కార్మికుల పక్షాన పోరాడుతామని తెలిపారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు మండల కన్వీనర్ పైపల్లి గంగాధర్, పెదపల్లి బాబా, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

రైతులు అంగీకరిస్తేనే ప్రాజెక్టుపై ముందుకెళ్తాం

మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - ముదిగుబ్బ

రైతులు అంగీకరిస్తేనే తాము జిల్లేడు బండ ప్రాజెక్టుపై ముందుకు వెళ్తామని మంత్రి సత్య కుమార్ అన్నారు. ఈ మేరకు మంత్రి సత్య కుమార్ ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జనసేన నేత మధుసూదన్ రెడ్డితో కలిసి ముదిగుబ్బ మండలం పొడరాళ్లపల్లి వద్ద ఉన్న జిల్లేడు బండ ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు పరిధిలో బలవంతంగా సేకరిస్తున్న భూమిని పరిశీలించి అక్కడ రైతులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. చాలామంది రైతులు కన్నీరు పెట్టుకుంటూ నేతల వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 14 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పోలవరం ప్రాజెక్టు కూడా 2.6 కిలోమీటర్లు మాత్రమే ఉందన్నారు. కానీ ఇక్కడ 23 వేల ఎకరాలకు సాగు సాగునీరు అందించేందుకు ఎనిమిది కిలోమీటర్ల మేర ప్రాజెక్టు నిర్మిస్తున్నారంటే ఆశ్చర్యం వేసిందన్నారు. ఎక్కడైనా ప్రాజెక్టులు వస్తే దాని వెనుక దశాబ్దాల పోరాటం ఉంటుందన్నారు. కానీ ఇక్కడ రైతులు అడగకుండానే వారు ఒప్పుకోకుండానే బలవంతంగా భూములు లాక్కొని ప్రాజెక్టులు నిర్మిస్తున్నారంటే దాని వెనుక ఉద్దేశం ఏంటో అర్థం అవుతోందన్నారు. 620 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు వలన ప్రయోజనం ఎంత ఉందనేది కూడా ఒకసారి సమీక్షించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. మొత్తం అన్ని అంశాలు పరిశీలించిన తర్వాత. రైతుల ఇష్ట ప్రకారం మాత్రమే ఇక్కడ ఏదైనా జరుగుతుందన్నారు. టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా అనాలోచితంగా నిర్మిస్తున్న ప్రాజెక్టు జిల్లేడు బండ ప్రాజెక్టు అని అన్నారు. గతంలో తాము జిల్లేడు బండ ప్రాజెక్టు పరిశీలించడానికి వచ్చినప్పుడు ఇక్కడ పరిస్థితి చూసి ఆశ్చర్యపోయామన్నారు. రైతులతో కలసి సమావేశం నిర్వహిస్తే తమకు ఎలాంటి ప్రాజెక్టులు వద్దని పురుగుల మందు ఇచ్చి తమకు విముక్తి కలిగించండి అని అన్నారంటే ఇక్కడ రైతులు ఈ ప్రాజెక్టును ఎంత వ్యతిరేకిస్తున్నారో అర్థమవుతుందన్నారు. అసలు రైతులను కోరకుండా వారికి ఎలాంటి ఉపయోగం లేకుండా ప్రాజెక్టు ఎలా నిర్మిస్తున్నారో కూడా అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో మరొకసారి పూర్తిస్థాయిలో సమీక్షించి రైతుల అభిప్రాయాలు తీసుకొని వారు సమ్మతిస్తేనే నిర్మాణం ముందుకు సాగుతుందని శ్రీరామ్ అన్నారు. అంతవరకు ఈ ప్రాజెక్టు విషయంలో అడుగు ముందుకు వేయరని ఆయన భరోసా ఇచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

జిల్లా పంచాయతీ అధికారి సమత

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలోని పంచాయతీలను అభివృద్ధి పరచి వాటిని ఆదర్శ పంచాయతీలుగా తీర్చి దిద్దాలన్నదే తమ ధ్యేయమని అందుకోసం అన్ని చర్యలు చేపడుతున్నామని శ్రీ సత్య సాయి జిల్లా పంచాయతీ అధికారి సమత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న: సత్యసాయి జయంతిని దృష్టిలో ఉంచుకొని పుట్టపర్తి లో ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

జవాబు: శ్రీ సత్య సాయి బాబా 99వ జయంతి ఉత్సవాలు ఈనెల 18 నుండి ప్రారంభం కానున్న తరుణంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా శ్రీ సత్య సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రధాన ద్వారం నుంచి మామిళ్ళకుంట వరకు, ప్రశాంతి రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కడగకుండా చర్యలు తీసుకుంటున్నాం. రహదారులు వెంబడి పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి, తాగునీటి వసతి వంటి పనులను చేపట్టాం. ఉత్సవాలు ముగిసే వరకు నిరంతర పర్యవేక్షణ, సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పారిశుధ్యకార్మికులను కొంతమందిని ఇక్కడ విధుల్లో నియమించాం.

ప్ర: సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ ఏ విధంగా ఉంది?

జ: జిల్లా వ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు 421 ఉన్నాయి. వాటితో కార్మికులు గ్రామంలో సేకరించిన తడి చెత్త పొడి చెత్తను వేరు వేరు చేసి, వాటిలో వానపాములను వదిలి ఎరువుగా తయారు చేసి ఆ ఎరువును రైతులకు కిలో 40 రూపాయలు చొప్పున అమ్మి దాని ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపడుతున్నాం. పంచాయతీలలో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడం, వీధులను శుభ్రం చేయడం వలన, పంచాయతీ పరిశుభ్రంగా ఉండటమే కాక , చెత్త ద్వారా సేకరించిన ప్లాస్టిక్ బాటిల్ ,ఇనుము ముక్కలు, సిల్వర్ ,తదితర వస్తువుల ద్వారా పంచాయతీలకు కొంత ఆదాయం లభిస్తుంది.

ప్ర : పంచాయతీ సెక్రెటరీ గ్రేడ్ 5 ఉద్యోగుల వేతనాల సమస్యపై మీ సమాధానం ?

జ: పంచాయతీ సెక్రటరీల గ్రేడ్ 5 ఉద్యోగుల శాలరీ విషయంలో కొంతకాలం నుండి సమస్య నెలకొంది. వీరి శాలరీ సమస్య రెండు మూడు నెలల్లో పరిష్కారం అవనుంది.

ప్ర : జిల్లావ్యాప్తంగా పంచాయతీల్లో ఏయే అభివృద్ధి పనులు చేపడుతున్నారు.? ఎంత నిధులు మంజూరు అయ్యాయి?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీలలో డ్రైనేజీ, సిమెంట్ రోడ్లు, గ్రామాల్లో తాగునీటి సమస్య, వీధిలైట్లు ఏర్పాటు రోడ్లు మరమ్మతులకు మొదటి ప్రాధాన్యత నిస్తున్నాం. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పంచాయతీలకు 2024 -25 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక నిధులు క్రింద జిల్లాకు రూ.31.5 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. వీటిని జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీల ఖాతాల్లోకి జమ చేశారు. ఈ నిధుల ద్వారా పంచాయతీలలో అభివృద్ధి పనులను సక్రమంగా జరిగే విధంగా డి ఎల్‌పిఒలకు, ఇఒఆర్‌డిలకు సూచనలు ఇచ్చాం.

ప్ర : ఈవోఆర్డీల ఉద్యోగోన్నతి, జిల్లాలో సిబ్బంది కొరత పై మీ అభిప్రాయం?

జ: ఈవోఆర్డీలకు, పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్ల విషయంలో ఉన్నతాధికారుల నుండి త్వరలో ఉత్తర్వులు అందను న్నాయి. జిల్లా కేంద్రంలో సిబ్బంది కొరత ఉంది. డిపిఆర్‌సిలో ఆర్పీలు నలుగురు ఉండాల్సుండగా ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. జడ్పీ కార్యాలయం నుండి ఇద్దరిని నియమించగా వారు ఇక్కడికి ఇంకా రాలేదు. వారు ఇక్కడికి వచ్చిన తర్వాత అన్ని పనులు సవ్యంగా సాగుతాయి. ఎలాంటి పనులకు ఆటంకం లేకుండా ఉన్న సిబ్బందితోనే సర్దుకు వెళుతున్నాం.

డిపిఒ సమత

మహిళలపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

బాధిత మహిళలను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువులో మహిళలపై దాడి చేసిన టిడిపి నాయకులను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు ఆదివారం కొత్తచెరువు వెళ్లి దాడికి గురైన అత్తాకోడళు పార్వతమ్మ, ప్రణీతలను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ నెహ్రూ కాలనీలో రోడ్డు వెడల్పులో భాగంగా టిడిపి నాయకులు దౌర్జన్యానికి దిగి ఇంటి ముందు ఉన్న మెట్లు, తొట్టెలను పగలకొట్టడం, మహిళలపై చేయి చేసుకోవడం, అసభ్యంగా మాట్లాడడం బాధాకరం అన్నారు. ఈ విషయంలో పోలీసులు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. అలాగే ఈ ప్రభుత్వంలో చిరుద్యోగులపై కక్ష గట్టి ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఇకనైనా పోలీసులు స్పందించి దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్, శాఖ కార్యదర్శి బ్యాళ్ల అంజి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి మంత్రి పరామర్శ

విద్యార్థి తల్లిదండ్రులను ఓదారుస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రయివేటు స్కూల్ బస్సు ఢీకొనడతో మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ఆదివారం బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పరామర్శించారు. నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురంలో రెండు రోజుల క్రితం ఓ ప్రయివేటు స్కూల్ బస్సు ఢీకొనడంతో విద్యార్థి అఖిల్ మృతి చెందాడు. దీంతో ఆదివారం మంత్రి సవిత వారింటికి వెళ్లి విద్యార్థి తల్లిదండ్రులు నాగరాజు, రాధమ్మను పరామర్శించారు. అనంతరం ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మంత్రి వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, వెంకటగిరిపాలెం శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వర్గీకరణపై విచారణను వేగవంతం చేయాలి

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య

సమావేశంలో మాట్లాడుతున్న దండు వీరయ్య

ప్రజాశక్తి-మడకశిర

ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ తక్షణమే బాధ్యతలు చేపట్టాలని ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ కోరారు. రొళ్లలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం దండోరా ఉద్యమం ద్వారా అవిశ్రాంత పోరాటం జరిగిందన్నారు. ఫలితంగా సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని తీర్పు ఇచ్చిందన్నారు. ఈ మేరకు ఎపిలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ప్రభుత్వం రిటైర్డ్ ఐఎఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ నియమించిందన్నారు. ఈ కమిషన్ ఎస్సీల్లోని 59 కులాల గణంకాలను నిష్పక్ష పాతంగా సేకరించాలని కోరారు. ఆయనతో పాటు డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్. హనుమంతు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్తరంగప్ప, శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, నాయకులు కాంత రాజు, మోతీ రామ్‌నాయక్, లోచర్ల నరసింహులు, అంజనప్ప, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న సత్యసాయి భక్తులు

నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న విదేశీ మహిళ

సత్యసాయి భక్తుల సేవాదృక్పథం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

శ్రీసత్యసాయి భక్తురాలు ఓంకారం జన్మదినం సందర్భంగా ఆమె కుమారుడు మాల రవిశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో అన్న, వస్త్రదానం చేశారు. ముందుగా మాల రవిశంకర్ దంపతులు సత్యసాయి భక్త బృందంతో కలిసి భజన చేశారు. భజన కార్యక్రమంలో దాదాపు 200 మంది మహిళలు, పురుషులు పాల్గొన్నారు. వృద్ధురాలైన ఓంకారం మంచానికే పరిమితమైనప్పటికీ భజన ప్రాంగణంలోనే గడిపారు. అనంతరం రవిశంకర్ ఆధ్వర్యంలో 200 మందికి అన్న వస్త్ర దానాలు చేశారు. కార్యక్రమంలో ఆటో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున, పలువురు భక్తులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

పోలెండ్ దేశానికి చెందిన సత్యసాయి భక్తురాలు క్రిష్టినా నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆమె ఏడాదిలో ఒకటి, రెండుసార్లు పుట్టపర్తికి వచ్చి ఇక్కడే కొంతకాలం పాటు ఉండి నిరుపేదలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తోంది. ఈ క్రమంలోనే నిరుపేదలకు 10 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

విద్యార్థుల సమస్యలపై పోరాడుదాం

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యార్థుల సమస్యలపై పోరాడుదామని ఎఐఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహ పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం ఎఐఎస్‌పి సమావేశం నిర్వహించి జిల్లా నూతన కమిటీని ఎన్నుకొన్నారు. జిల్లా అధ్యక్షునిగా ఉదయ్, కార్యదర్శిగా ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పృథ్వీరాజ్, కిరణ్, ఆదిత్య, సహాయ కార్యదర్శులుగా అజయ్, దర్శన్, అభిలాష్, కమిటీ సభ్యులుగా 63 మందిని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థుల సమస్యలు, జిల్లాకు యూనివర్సిటీ, మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీలు, హాస్టల్స్‌కు సొంత భవనాలు, తదితర డిమాండ్లతో రాజీలేని పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు రాకేష్, అభి, సాయికుమార్, యశ్వంత్, వివిధ నియోజకవర్గాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వనభోజనాలు


నృత్యం చేసిన బాలికలకు నగదు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని ఎముకలగుట్టపల్లి మినీ తిమ్మమ్మ మర్రిమాను సమీపంలో ఆదివారం బలిజ సంఘం ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ బలిజ సామాజిక వర్గం ప్రజలు ఐక్యతను చాటుకోవాలన్నారు. మండలంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో ట్రస్ట్ ఏర్పాటు చేసి విద్యార్థుల ఉన్నత చదువులు, ఆపద సమయంలో ఆదుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. వేద ప్రజ్ఞ, హన్సిక, ఇతర చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. చొండూరువాండ్లపల్లికి చెందిన భజన బృందం ఆలపించిన భక్తి సంకీర్తనలు అలరించాయి. నృత్యం చేసిన ఒక్కో చిన్నారికి బలిజ సంఘం నాయకులు రూ. 5వేల చొప్పున, ధనుంజయ రూ. 5వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్, కిషోర్, కృష్ణా, సోము, మండల బలిజ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : చిలమత్తూరు ఫారెస్ట్ నర్సరీ సమీపంలోని పొలంరాజుల ఆలయం వద్ద ఆదివారం స్థానిక బిసి కాలనీవాసులు కార్తీక వనభోజనాలు కార్యక్రమం నిర్వహించారు. వారు ముందుగా పొలంరాజులస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా పంట కోతల అనంతరం కార్తీక మాసం చివరలో పొలం రాజుల ఆలయం వద్ద కార్తీక వనభోజనాలు నిర్వహించడం ఆనవాయితీ. వనభోజనంలో ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మల్లికార్జున, నాగేంద్ర, విజయ్, భాస్కర్, ఆనంద్, నాగరాజు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠాపురంలో చండీహోమం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

లోక కళ్యాణార్థం ఆదివారం మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో వెలసిన శ్రీనీలకంఠేశ్వర ఆలయంలో మాజీ మంత్రి, సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. హోమ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులను వేద పండితులు పెద్దలు ఆశీర్వదించారు. రఘువీరా మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు.

చెరువులు నింపిన ఘనత చంద్రబాబుదే : ఎమ్మెల్యే

ఆయకట్టుకు నీరు విడుదుల చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ప్రజాశక్తి-బుక్కపట్నం

చెరువులకు నీరిచ్చిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలి పారు. బుక్కపట్నం చెరువు కింద ఉన్న ఆయకట్టు భూములకు ఆదివారం ఎమ్మెల్యే సింధూర మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి నీరు విడుదల చేశారు. వారు ముందుగా బుక్కపట్నం చెరువులో రైతులతో కలిసి గంగపూజ చేశారు. అనంతరం తూము గేట్లు ఎత్తి ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేయగా సిఎం చంద్రబాబు రూ. 16 వేల కోట్లకుపైగా నిధులు కేటాయించారన్నారు. అలాగే 2047 విజన్‌తో పేదరి కం లేని ఆర్థిక ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలనే లక్ష్యంతో పాలన సాగిస్తున్నారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాను హార్టికల్చర్, అగ్రికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా బుక్కపట్నం చెరువులో ఇటీవలే బోటింగ్‌ను ప్రారంభించామన్నారు. ఈ ప్రాంతం లో రెస్టారెంట్లు, హోటల్స్ ఏర్పాటుకు పలు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ బుక్కపట్నం చెరువును ఎల్లప్పుడూ పూర్తిగా నీటితో నింపుతామని, చెరువు మధ్యలో శ్రీసత్యసాయిబాబా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. పుట్టపర్తిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ షాబుద్దీన్, ఇరిగేషన్ జేఈ జమునబాయ్, టిడిపి మండల కన్వీనర్ మలిరెడ్డి, మాజీ సర్పంచి సాకే యశోద, గంగాధర్, చెన్నకృష్ణ, సంజీవరాయుడు, వెంకట రాముడు, సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ బాలు, ఆదినారాయణ, సతీష్ రాయల్, శ్రీనివాసులు, మంజు, సుధీర్, నాగభూషణం, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని ఎన్‌జిఓ హోంలో ఆదివారం కొక్కంటి హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.సుభానుల్లా అధ్యక్షతన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు డాక్టర్ ఎస్.ఇర్ఫాన్ కౌసర్, షేక్ మొహమ్మద్ యాసిన్‌లను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వైవి. సుబ్బా రెడ్డి, సీనియర్ నాయకులు గౌస్‌ఖాన్, రెడ్డిపల్లి హెచ్‌ఎం జంషీద్, మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వరప్రసాద్‌రాజు, జిల్లా ఎఎంఓ అబ్దుల్ మాలిక్, సీనియర్ ఉపాధ్యాయులు ముంతాజ్, అయూబ్‌బాషా మాట్లాడుతూ కదిరి ప్రాంతానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. డాక్టర్ ఇర్ఫాన్ కౌసర్ ఉర్దూ భాషకు చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు ఉర్దూ అకాడమీ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు ఉర్దూ రచనలకు డాక్టరేట్‌ని ప్రదానం చేశారన్నారు. షేక్ మహమ్మద్ యాసిన్ రచయితగా, హిందీ విద్యార్థుల కోసం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేసి హిందీ ఉపాధ్యాయ లోకానికి తన వంతు సహకారం అందిస్తు న్నారని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నూరు తాహిర్‌వలి, నాయకులు ఆజాంబాషా, రవివర్ధన్‌రెడ్డి నజీర్, ఖాజా, ఇర్ఫాన్, ఖాజాపీర్, లక్ష్మీనారాయణ, హనీఫ్, షబ్బీర్, హరిప్రసాద్‌రెడ్డి, సురేష్, మహమ్మద్ అలీ, మహబూబ్ బాషా, ఇర్షాద్, సమీవుల్లా, రియాజ్, అజ్మత్, వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను కాపాడుకుందాం

కళాకారులను సన్మానిస్తున్న ట్రస్టు అధ్యక్షులు అంజనప్ప

ప్రజాశక్తి-బత్తలపల్లి

సంప్రదాయ కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తేనె తెలుగు కల్చరల్ ఛారి టబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అంజనప్ప తెలిపారు. ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ప్రముఖ రంగస్థల హార్మోనిస్ట్ 'పాడుతా తీయగా' కార్యక్రమంలో యువతతో పద్యాలు పాడించిన సంగీత దర్శ కులు డాక్టర్ టి.రాజబాబు నేతృత్వంలో '200వ కళాభిషేకం' నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షులు అంజ నప్ప మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో సంప్రదాయ కళలకు పూర్వ వైభవం తీసుకురావాలనే సంకల్పం తోనే కళాభిషేకం నిర్వహించామన్నారు. అందులో ప్రస్తుతం సంప్రదాయ కళారంగం పరిస్థితులు, గాన గంధర్వుడు బాలసుబ్రహ్మణ్యంతో అనుబంధం గురించి కళాకారులు చర్చించుకున్నారు. అనంతరం కళాకారులు రాజబాబు, వివి.రావు, సర్వేశ్వరరావు, భద్రం, రాజు, జగ్గయ్య, తెనాలిపంతులు, సంజీవ రావును సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాభిషేకం డైరెక్టర్ పెద్దరికం సాయి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రవీంద్ర విద్యానికేతన్ భవనాల ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-గుడిబండ

పట్టణంలో నూతనంగా నిర్మించిన రవీంద్ర విద్యానికేతన్ పాఠశాల భవన సముదాయన్ని సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు కరస్పాండెంట్లు రాజు, చిత్తయ్య తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, వేణుగోపాలశర్మ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప హాజరవుతారని తెలిపారు.

27న చెరువుల వేలం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని సీసీ గిరి, బైరేపల్లి చెరువుల్లో చేపల పెంపకం కోసం ఈ నెల 27వ తేదీ సీసీ గిరి గ్రామ సచివాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అశోక్ తెలిపారు. పంచాయతీ నిబంధనలకు లోబడి ఈవోఆర్‌డి నాగరాజునాయక్, సర్పంచి యంజేరే గౌడ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. పంచాయతీకి రూ. 10వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు. వేలం పాటదారులు పంచాయతీకి గతంలో ఎలాంటి బకాయిలు ఉండరాదన్నారు.

అంగన్వాడీ కార్యకర్త మృతికి నివాళి

చిలమత్తూరు : మండలంలోని శెట్టిపల్లి గ్రామపంచాయతీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న దుర్గాదేవి ఆదివారం మృతి చెందింది. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. దుర్గాదేవి మృతికి సిఐటియు మండల కమిటీ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సంతాపం తెలిపారు. అలాగే అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు శోభమ్మ దుర్గాదేవి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-గుడిబండ

వార్షిక తనిఖీలో భాగంగా ఆదివారం పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. మండల వ్యాప్తంగా నేరాలకు సంబంధించి ఎస్ఐ మునిప్రతాప్ ను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను వేగంగా దర్యాప్తు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్ఐని ఆదేశించారు. డీఎస్పీ వెంట మడకశిర రూరల్ సిఐ రాజకుమార్, ఎఎస్ఐ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు మహమ్మద్ రఫీ, పాతన్న, చంద్రానాయక్, హోంగార్డ్ రామన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్ఎల మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కదిరి టౌన్

మండల విఆర్ఎల సంఘం నూతన అధ్యక్షుడిగా బెల్లపు మహేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విఆర్ఎలు ఆదివారం పుట్టపర్తిలోని తహశీల్దార్ కార్యాలయంలో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. మండల ఉపాధ్యక్షులుగా దుంపల ఆంజనేయులు, బి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా షేక్ బాబాఫకృద్దీన్, కార్యవర్గ సభ్యులుగా సి.వెంకటేష్, జి.రాజేంద్ర, కె.షాకీర్, కె.నాగభూషణం, వి.గంగులమ్మను ఎన్నుకున్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ముదిగుబ్బలో ఆదివారం సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. మేజర్ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు ఆర్డర్ కాపీ, కనీస వేతనం రూ. 26 వేలు, ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తింపు, పిఎఫ్, ఈఎస్ఐ, మౌలిక సదుపా యాల కల్పించాలని, కార్మికులు మృతి చెందితే దహన సంస్కారాలకు రూ. 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్‌జాన్, టైలర్ ముస్తఫా, రఫీ, నౌషాద్, వెంగముని, పంచాయతీ కార్మికులు, వాటర్ మ్యాన్లు బాషా, కిరణ్, ఆది నారాయణ, ఓబులేసు, సావిత్రి, హరి పాల్గొన్నారు.

విషజ్వరాల నివారణ చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఇటీవల కాలంలో కొత్తచెరువులో విష జ్వరాలు ప్రబలుతున్నాయని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే నివారణ చర్యలు తీసుకోవాలని సిపిఎం పుట్టపర్తి డివిజన్ ప్రాంతీయ కార్యదర్శి బి.అంజి, ఐద్వా జిల్లా కార్యదర్శి నాగమణి కోరారు. వారు ఆదివారం స్థానిక బిసి కాలనీలో పర్యటించి ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నారాయణస్వామి, నాగలక్ష్మి ఇళ్లలో దాదాపు పది మంది జ్వరాలతో బాధపడుతుండగా వారిని పరామర్శించారు. అధికారులు తక్షణమే గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వర పీడితులకు వైద్యం అందించాలని, అలాగే జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలు, ఐద్వా నాయకురాలు శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలపై మంత్రికి ఫిర్యాదు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

వివిధ సమస్యలపై ఆదివారం ముదిగుబ్బలో మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో వినతిపత్రాలు ఇచ్చారు. మండలంలోని రాళ్ల అనంత పురం క్రాస్ సమీపంలో కబ్జాకు గురైన భూములు, పారిశుధ్య కార్మికుల సమస్యలు, శ్మశానవాటికకు స్థలం కోసం మంత్రికి వినతి పత్రం ఇవ్వగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, పోతులయ్య, మునాఫ్, పారిశుధ్య కార్మికులు వాటర్ మ్యాన్లు బాషా, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక చౌడేశ్వరీకాలనీ(నక్కలగుట్ట)లో నివాసం ఉండే ఆటో సూర్యనారాయణ(45) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలు.. సూర్యనారాయణ పాలసముద్రం సమీపంలోని ఒక కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తుండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి నైట్ డ్యూటీ ముగించుకొని ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో ద్విచక్ర వాహ నంపై సోమందేపల్లికి వస్తుండగా బెంగళూరు వైపు నుంచి వస్తున్న ఓ కారు వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య కృష్ణవేణి, కుమారుడు గురుతేజ, కుమార్తె అంజలి ఉన్నారు. పెద్దదిక్కు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.70/2019 in O.S.73/2017

Between:
K.బాబురెడ్డి, S/o.కోనపల్లి ఆనందరెడ్డి
డోరునెం.2-45, కంచన గారి పల్లి,
H/o.కస్సముద్రము, నిలువరాతిపల్లి Post,
అమడగూరు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...డిక్రీ హోల్డరు
Vs
1.S.షంపాద్ బేగం, W/o.Late షేక్‌సాబ్
2.S.జబీవుల్లా, S/o.Late షేక్‌సాబ్
3.S.ముబారక్, S/o.Late షేక్‌సాబ్
4.S.ఇర్‌ఫాన్, S/o.Late షేక్‌సాబ్
అందరు డోరునెం.3-36-11-A, ఓబుళ దేవర చెరువు, ఓబుళ దేవర చెరువు మండలం, శ్రీసత్యసాయి జిల్లా. ...జెడ్జిమెంట్ డెబ్టార్స్

వేలము ప్రకటన

పై E.P లోని డిక్రీ హోల్డరు తన డిక్రీ మొత్తము రాబట్టు నిమిత్తమై జడ్జిమెంటు డెబ్టార్స్‌కు సంబంధించిన క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులు వేలము కోరినాడు. పై కోర్టు వేలము **ఉదయం 10.30 గం॥ల పైన 10.12.2024** వ తేదీన జరుపబడును. ఆసక్తి గల వారు పైతేదీన వేలములో పాల్గొని వేలము పాడవచ్చునని ఈ ప్రకటన ద్వారా అందరికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు

అనంతపురం జిల్లా ప్రస్తుతము సత్యసాయి జిల్లా హిందూపురం ఆర్.డి. ప్రస్తుతము పుట్టపర్తి ఆర్‌డి కదిరి సబ్ ఆర్.డి కి చేరి ఓబుళ దేవర చెరువు గ్రామ పొలములోని ఆస్తి వివరము :
సర్కారు ఖుష్కీ స.నెం.72-1 విస్తీర్ణం 1-71 సెంట్లు పైనే లేక 0.692 హెక్టార్లు ఇందులో విస్తీర్ణం 0-85 1/2 సెంట్లు మరియు ఇందులో వున్న 198 చదరపు గజముల ఖాళీ స్థలం యిందు చెందినది. **తూర్పు:** రస్తా, **పడమర:** పెద్ద బయపరెడ్డి మరియు ఇతరుల ఖాళీ స్థలము. **ఉత్తరం :** మలక వారిపల్లి మునెపు ఖాళీ స్థలం. **దక్షిణం:** ఎం.జయచంద్ర రెడ్డి ఖాళీ స్థలం విస్తీర్ణం **తూర్పు-పడమర:** 33 అడుగులు లేక 10.054 మీటర్లు మరియు **ఉత్తర - దక్షిణం :** 54 అడుగులు లేక 16-452 మీటర్లు అనగా 198 చదరపు గజాలలో 1/2 భాగము అనగా 99 చదరపు గజాలు
డిక్రీ హోల్డరు మతింపు రూ.6,00,000/-
కోర్టు అమీనా మతింపు రూ.3,00,000/- ఒక సెంటు
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 10-12-2024
పిడుగు రవీంద్రబాబు, M.A., B.L.
డిక్రీ హోల్డరు తరపు వకీలు, కదిరి.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు ఆదివారం జిల్లావ్యాప్తంగా రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారి ప్రవర్తనపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని, గొడవలు, సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో నడుచుకొని ప్రశాంత జీవితం గడపాలని సూచించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమ, నిబంధనల గురించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, బాల్య వివాహాలు, తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అటవీ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. జిల్లా వ్యాప్తంగా పేకాట, కోడిపందెం, తదితర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ధర్మవరం రూరల్ : పట్టణంలోని సుందరయ్య నగర్‌లో ఆదివారం టిడిపి నాయకులు బెల్లం తిరుపాలు ఆధర్వంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వెంకట చౌదరి, రమణ, జింకా ఈశ్వరయ్య, గవ్వల శంకర, బోయ నాగేంద్ర, మురళి, నాగరాజు, నరేష్ పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని నారనాగేపల్లి పంచాయతీలోని రాచూరు గ్రామంలో టిడిపి నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. వారు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయో జనాలను ప్రజలకు వివరించి సభ్యత్వాలు చేయించారు. కార్యక్రమంలో రెడ్డప్ప, వెంకటరెడ్డి, చెన్న కేశవులు, నరసింహారెడ్డి, మణిపాల్, రవీంద్ర, సుదర్శన్, రంగస్వామి, ట్యాబ్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మడకశిర : రొళ్ల మండలంలో జిల్లా టిడిపి కార్యదర్శి ఎస్.రవి భూషణ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతుందని మాజీ సర్పంచి వెంకటేష్, నాయకులు రియాజ్, మురళి, శివ, నరసిహంప్ప, సురేష్ తెలిపారు. వారు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదు చేయిస్తున్నామని తెలిపారు.

రాజశ్రీ కదిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.03/2023

Between:
కొరటి అరుణజ్యోతి, W/o.Late కె.వెంకటరమణ, గొల్లవారిపల్లి, తనకల్లు మండలం, శ్రీసత్యసాయి జిల్లా. ...వాది
Vs
ఎద్దుల జయచంద్రారెడ్డి మరియు యితరులు ...ప్రతివాదులు
To.
D9: చారుపల్లి రఘునాథరెడ్డి, S/o.Late శిద్దారెడ్డి
D10: చారుపల్లి శ్రీకాంత్‌రెడ్డి, S/o.Late శిద్దారెడ్డి
D11: చారుపల్లి విశ్వనాథరెడ్డి, S/o.Late శిద్దారెడ్డి
D12: చారుపల్లి అమరనాథరెడ్డి, S/o.Late శిద్దారెడ్డి
అందరు గొల్లవారిపల్లి తనకల్లు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

9,10,11,12 ప్రతివాదులకు దావా సమను

పై దావాలోని వాది ఈ దావాను ప్రతివాదులు అయిన మీ మీద భూమిలోని ప్రవేశించకూడదని పర్మినెంటు ఇంజెంక్షను కొరకు దావా వేసివున్నాడు. దావాలో 9,10,11,12 ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తమై దావా **24-12-2024వ** తేదీ వాయిదా వేయబడివున్నది. స్వయాన కానీ, మీ వకీలు ద్వారా కానీ హాజరు అయి ఆక్షేపణలున్న యెడల తెలుపుకోవలయునని యిందుమూలముగా తెలియజేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 24-12-2024
పిడుగు రవీంద్రబాబు, M.A.,B.L.
వాది తరపు వకీలు, కదిరి.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, కదిరి

I.A.No.422/2024 in O.S.No.434/2016

Between:
1.కావేటి గంగులప్ప,
2.కావేటి సూర్యనారాయణ ...వాదులు
మరియు
1.బాపనపల్లి మస్తాన్ రెడ్డి (died by his L.Rs the Defendant No:3 to 6)
2.బాపనపల్లి సుధాకర్ రెడ్డి
3.బాపనపల్లి సరోజమ్మ
4.బాపనపల్లి కళావతి
5.బాపనపల్లి సోమశేఖర్ రెడ్డి
6.బాపనపల్లి భాస్కర రెడ్డి ...ప్రతివాదులు

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా పైన తెలిపిన వాదులు, ప్రతివాదులైన నెం 1 to 3 పైన తెల్పిన కోర్టు నందు ఇంజక్షన్ దావా వేసి యున్నారు. ప్రతివాది అయిన బాపనపల్లి మస్తాన్ రెడ్డి చనిపోయిన కారణంగా, కోర్టు వారి ఉత్తర్వు మేరకు వారసులైన ప్రతివాదులు 3 to 6 ను దావాలో చేర్చడమైనది. పైన తెల్పిన వారికి సమాను జారీ చేయు నిమిత్తము కోర్టు వారు పబ్లికేషన్‌కు అనుమతిని ఇవ్వడము జరిగింది.

Defendant No:3 to 6 సమన్లు

3.బాపనపల్లి సరోజమ్మ W/o Late బాపనపల్లి పక్కీరరెడ్డి, వయస్సు 64 సం॥లు,
4.బాపనపల్లి కళావతి W/o Late బాపనపల్లి మస్తాన్ రెడ్డి, వయస్సు 70 సం॥లు, హిందూ, House Wife,
5.బాపనపల్లి సోమశేఖర్ రెడ్డి S/o Late బాపనపల్లి మస్తాన్ రెడ్డి, వయస్సు 50 సం॥లు, హిందూ, రిటైర్డు బ్యాంకు మేనేజరు,
6.బాపనపల్లి భాస్కర రెడ్డి S/o Late బాపనపల్లి మస్తాన్ రెడ్డి, వయస్సు 48 సం॥లు, హిందూ, వ్యాపారం మరియు వ్యవసాయం.
No:3 to 6 are R/o D.No:2-133, మీసాలవాండ్ల పల్లి గ్రామం, H/o యర్రవంకపల్లి వేళ్ళమద్ది (పంచాయితీ) నల్లమాడ (మం) శ్రీ సత్యసాయి (జిల్లా)

పై తెలిపిన 3 నుంచి 6 వరకు ఉన్న ప్రతివాదులు అయిన మీరు పైన తెల్పిన కోర్టు నందు మీ యొక్క హాజరు నిమిత్తము ఉ॥ 10:30 గంటలకు వాయిదా తేది 29-11-2024వ తేదిన ఖుద్దున గానీ మీ ఉత్తర్వులు పొందిన వకీలు ద్వారా గానీ హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు కోర్టు వారికి తెలుపుకోగలరు. అట్లు కాని యెడల పై తెల్పిన దావా మీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:29/11/2024
స్థలం:కదిరి కోర్టు
సమయము:10:30 ని॥లకు

ఎ.క్రిష్ణమూర్తి MA.,LLB,
వాది తరుపు న్యాయవాది,కదిరి.
సెల్:9440310692,8886389692